పనామా పత్రాలు

# గుత్తపెట్టుబడిదారీ విధానపు అసలు రూపం

**వేలకోట్ల** ధనాన్ని విదేశాల్లోని పన్నులులేని "స్వర్గాల్లో" ధనాఢ్యులూ, రాజకీయనేతలూ దాచుకున్నారని పనామా పత్రాలు వెల్లడించటం కొందరిని దిగ్భ్రమకు గురిచేసి వుండవచ్చునేమోకానీ, బడావాణిజ్యవేత్తల వ్యవహారశైలి తెలిసిన వారెవరికీ ఆశ్చర్యాన్ని కలిగించదు. గత కొన్ని సంవత్సారాల్లో వెలుగులోకి వచ్చిన ఉదంతాలిలా వున్నాయి.

వందలాది కంపెనీలు, వేలాదివ్యక్తులు, 72మంది ప్రస్తుత, మాజీ దేశాధినేతలు తమ ధనాన్ని విదేశాల్లో దాచుకున్నారని పనామా పత్రాలు వెల్లడించాయి.

లగ్జెంబర్గ్ యువరాణి కొన్ని పెద్ద కంపెనీలతో చేతులు కలిపి అతి తక్కువ పన్నులు చెల్లించాల్సిన లగ్జెంబర్గులోకి వాటి ధనాన్ని తరలించేందుకు సహాయ పడినట్లు "లక్స్ లీక్స్" పత్రాలు వెల్లడించాయి. బ్రిటన్‌లో సంపాదించిన లాభాలను అమెజాన్, స్టార్‌బక్స్ వంటిపెద్ద కంపెనీలు బ్రిటన్‌లో పన్నుకట్టకుండా లగ్జెంబర్గ్‌కు తరలించాయి. లైబార్(బ్యాంకులమధ్య వడ్డీని నిర్ణయించే రేటు) రేటును నిర్ణయించటంద్వారా, కొన్ని కంపెనీల స్టాకుకు ఉన్నదానికంటే ఎక్కువ విలువ వున్నట్లు చూపేందుకు, బ్రిటన్‌లోని బ్యాంకులు కుట్రచేశాయనికూడా గతంలో వెలుగులోకి వచ్చింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్‌జుమా, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్‌లు ప్రజాధనంతో విదేశాల్లో విలాసవంత భవనాలు నిర్మించారనీ బయటపడింది.

మెక్సికోకు చెందిన మత్తుమందుల అక్రమ వ్యాపార ముఠా సినలోయా నుండి హెచ్ఎస్‌బిసి బ్యాంకుకు 88 కోట్ల డాలర్లు అందినట్లు 2012లో బయటపడింది.

పనామా పత్రాలుగా పేరుపడిన నివేదికను అంతర్జాతీయ పరిశోధనాత్మక జర్నలిస్టుల వేదిక (ఐసిఐజె) బయటపెట్టింది. దీనిలో 12 మంది ప్రస్తుత ప్రభుత్వాధినేతలతో సహా 140 మంది ఉన్నతాధికారుల పేర్లు తెలిపింది. ప్రపంచంలో అత్యంత ధనికులుగా మొదటి 500 స్థానాలను తెలుపుతూ ఫోర్బ్స్ 500 జాబితాలోని 29 మంది శతకోటీశ్వరుల పేర్లు తెలిపింది. వారందరూ దేశంలో పన్నులు ఎగవేసి విదేశాల్లో దాచుకునేందుకు పనామాకు చెందిన మొసాక్ ఫోన్సెకా అన్న న్యాయసలహా కంపెనీ సహాయపడింది.

పనామా పత్రాలలో అతికొద్దిమంది అమెరికన్ల పేర్లు మాత్రమే వున్నాయి. అయితే మొసాక్ ఫొన్సెకా సేవలు అమెరికాలోని కంపెనీలకూ, ధనికులకూ అందుతూనే వున్నాయి. పన్నులు తక్కువగా వుండే డెలావేర్ రాష్ట్రంలోని ఒక చిన్న భవనంలో 2,85,000 కంపెనీల కార్యాలయాలున్నాయి. వాటిలో కోకాకోలా, ఆపిల్ కంప్యూటర్, జెపి మోర్గాన్‌ఛేజ్ వంటి పెద్ద కంపెనీలున్నాయి. వాటిలో మత్తుమందుల అక్రమ వ్యాపారులు, సూటుకేసు కంపెనీలు అనేకం వున్నాయి.

ఇలా ఎన్నైనా చెప్పుకుంటూపోవచ్చు. ప్రపంచ మంతా అవినీతిమయమై పోయినట్లు కన్పిస్తున్నది. ఏమిటిదంతా? ఎందుకిలా జరుగుతోంది?

పెట్టుబడిదారీ విధానంలో అవినీతి మొదటి నుంచీ వుంది. నయాఉదారవాద విధానాలు స్వేచ్ఛా మార్కెట్టును ప్రోత్సహించటంతో 1980ల నుండి అవినీతి అంతూపొంతూ లేకుండా పెరిగిపోయింది. నియమ నిబంధనలను సడలించటంతో ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం విపరీతంగా పెరిగిపోయింది. దీనితో కొన్ని పెద్దకంపెనీలవద్ద ధనం పోగుపడిపోయింది. దీనికి ఎక్కువ వడ్డీ రాబట్టడం, తక్కువ పన్ను చెల్లించటం, దానికోసం ఎంత అక్రమమైనా చేయటం సామాన్యమై పోయింది.

దీనికంతటికీ మూలస్థంభం బ్యాంకింగ్ వ్యవస్థ. అక్రమార్జనలన్నీ యూరపు, అమెరికా బ్యాంకులకే చేరతాయి. పన్ను ఎగవేతదారులే కాదు; లంచగొండి నేతల, ఉన్నతాధికారుల, మత్తుమందు మాఫియాల అక్రమార్జలన్నీ తమ బ్యాంకు ఖాతాలలో చేరేందుకు ఆ బ్యాంకులే సేవలందించే మార్గం చూపుతాయి.

పనామా పత్రాలు, ఇటువంటి అనేక ఇతర నివేదికలూ ఈ ఆర్థిక నేరాలను అప్పుడప్పుడు బయట పెడుతున్నాయి. ప్రభుత్వాధినేతలూ, నియంత్రించాల్సిన అధికారులూ ఈ అక్రమ ధనాఢ్యులు చెప్పినట్లు ఆడుతున్నందువల్లనే, ఈ ఆర్థిక నేరాలు సాగుతున్నాయి. ఐసిఐజె నివేదిక, గత నివేదికలలాగే బీరువాల్లో పెట్టి బూజుపట్టిస్తారు. మార్పంటూ ఏమీ జరగదు.

లెనిన్ ఇలా అన్నారు: "గుత్తాధిపత్యమంటూ ఒకసారి ఏర్పడిన తర్వాత, అది అనివార్యంగా ప్రజాజీవన రంగాలన్నింటిలోకీ చొచ్చుకుపోతుంది. అక్కడి ప్రభుత్వరూపమేదేనప్పటికీ ఇలాగే జరుగుతుంది. అవినీతి, అక్రమార్జనలు, లంచగొండితనం, అన్నిరకాల మోసాలూ అత్యధికస్థాయి కెదగటం లక్షణంగాగల కొత్త గుత్తధనాఢ్యవర్గం పుట్టుకొస్తుంది".

బాల్యదశలో వున్న గుత్తాధిపత్యాన్ని వివరించాడు లెనిన్. ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం ఆనాటికంటే అనేకరెట్లు పెరిగింది. ఈ నేరస్థ ధనాఢ్య ముఠా మన వూహలకందనంత స్థాయిలో చట్టా వ్యాపారం, అక్రమార్జనలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థనే దివాళా తీయిస్తున్నది.

ఈ అక్రమార్జనలు – పేదదేశాలనుండి, పేద ప్రజలనుండి పెద్దయెత్తున సంపదను కొల్లగొడుతున్న ఫలితమే! దేశంలో చట్టాలన్నింటినీ అతిక్రమించి అదనపు విలువద్వారా శ్రామిక వర్గాలు సృష్టించిన సంపదను దోచుకోవటం ప్రత్యక్షంగా జరుగుతోంది.

ఈ దోపిడీ సొమ్ముకైనా పన్ను చెల్లించకుండా తరలించటంతో ప్రభుత్వాలు నిధులులేవంటూ, విద్య, వైద్యం, రవాణావంటి ప్రజాసేవలన్నింటిని వదలి వేస్తున్నాయి. ఈ సేవలను మార్కెట్టు సూత్రాల ప్రకారం అందిస్తామంటూ ఈ దోపిడిగాండ్రు ముందుకొచ్చి తిరిగి ప్రజలను దోచుకుంటున్నారు.

నోకియా అన్న ఒక్క కంపెనీయే రెండులక్షల కోట్ల రూ॥లు లాభాలుగా తన మాతృకంపెనీకి భారత్ నుండి చేరవేసింది. ఈ లాభాలపై చెల్లించాల్సిన పన్ను 24వేల కోట్ల రూ॥లు. ఈ పన్ను కట్టకుండా చూస్తానని బిజెపి ఎన్నికల్లో వాగ్దానం చేసింది. గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత 2017 వరకూ కట్టనవసరంలేదనీ, ఆ తర్వాత నుంచి పన్ను చెల్లించాలని నిర్ణయించింది. తనకు రావాల్సిన పన్ను ఆదాయం వదలుకుని, పెట్టుబడులు పెట్టండంటూ మోడీ పశ్చిమ దేశరాజధానులన్నింటి చుట్టూ భిక్షాపాత్ర పట్టుకుని తిరుగుతున్నాడు.

అవినీతి, పరాన్నభుక్త జీవనం,నేరస్థత పెట్టుబడిదారీ విధానంలో కొందరు దారితప్పినందున సాగుతన్నవి కాదనీ, అదే, గుత్తపెట్టుబడిదారీ విధానపు అసలు రూపు అని పనామా పత్రాలు మరోసారి తెలిపాయి.

oooooo